


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కొడుకు పుట్టాలి

**సెకండ్ హేండ్** ఇల్లు కొనడం శ్రీదేవికి అసలు ఇష్టంలేదు. అందులో తను దాన్ని కళ్ళారా చూడకుండానే భర్త అడ్వాన్స్ ఇచ్చేయడం ఆమెని మరింత బాధించింది.

"అంత అర్జెంట్ ఏమిటి? నా డెలివరీ అయ్యేదాక ఆగకూడదా? ఆ రేటుకి కొత్త అపార్ట్‌మెంట్ రాదంటారా?" భర్తని ఫోన్‌లో అసంతృప్తిగా అడిగింది.

"నువ్వు రెండు విషయాలు గుర్తుంచుకో. ఒకటి అది మన పర్మినెంట్ ఇల్లుకాదు. ఫ్యూచర్‌లో ఇంకా మంచి ఇండిపెండెంట్ ఇల్లు కొంటాను. రెంట్ కట్టే బదులు ఇ.ఎం.ఐ కడతాం అంతే. రెండో విషయం ఏంటంటే, దాన్ని కొన్నతను ఒక్కరోజుకూడా ఆ ఇంట్లో లేడు. గృహప్రవేశం అనుకునే టైంకి ప్రాజెక్ట్ మీద అమెరికా వెళ్ళాడు. మూడేళ్ళు అనుకున్నది ఇంకో రెండేళ్ళు ఉండాల్సి వస్తుందని లోన్ క్లియర్ చేయడానికి దాన్ని అమ్మకానికి పెట్టాడు. సో.. మనమే మొదట ప్రవేశించేది. సెకండ్ హేండ్ అన్న ఆలోచన వదిలెయ్" భాస్కర్ అనునయంగా చెప్పాడు.

"సరే నా డెలివరీ అయ్యాక పాలు పొంగిద్దాం" అయిష్టంగానే ఒప్పుకుంది.

"పాలు లేదు. పెరుగు లేదు. నేను ఈ ఫస్ట్‌నించి అందులోకి మారుతున్నాను. సెంటిమెంట్స్ పెట్టుకోకు. అంతగా కావాలంటే పొట్టలోని బేబీ లక్కీఫెలో అనుకో" ఫోన్ పెట్టేసాడు.

పాప పుట్టిన మూడునెలలకి చంటిపిల్లతో శ్రీదేవి కొత్త ఇంట్లో అడుగుపెట్టింది. ఐదంతస్థుల బిల్డింగ్‌లో మూడోఫ్లోర్‌లోని అపార్ట్‌మెంట్. ఎదురుగా ఇంకో ఫ్లాట్ ఉంది అంతే. అంటే మొత్తం పది ఫ్లాట్స్. 'పర్లేదు. పెద్దగా గొడవుండదు' అనుకుంది.

ఆ మధ్యాహ్నం భోజనం చేసి డైనింగ్ టేబుల్ సర్దుతూంటే, కాలింగ్‌బెల్ వినిపించింది. తలుపు తీస్తే ఎదురుగా అరవైలలోని ఒక పెద్దావిడ నిలబడివుంది.

"రండి" ఎవరో తెలియకపోయినా లోపలికి ఆహ్వానించింది.

"నా పేరు సద్గుణ. మీ ఎదురు ఫ్లాట్‌లో ఉంటాను ఏడాదినించి ఈ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మరీ ఏకాకిలా ఫీలవుతున్నాను. మిగిలిన ఎనిమిది ఫ్లాట్స్ ఆడవాళ్ళు ఉద్యోగం చేస్తారు. ఈ ఫ్లాట్‌లోకి వచ్చే అమ్మాయి జాబ్ చేయకూడదు అని దేవుడ్ని ప్రార్థిస్తున్నా" ఆమె నవ్వుతూ తనతో తెచ్చిన పాయసం గిన్నెని టేబుల్ మీద ఉంచింది.

"నా పేరు శ్రీదేవి ఆంటీ. మీ ప్రార్థనలు ఫలించాయి. నేను వర్క్ చేయను" శ్రీదేవి కూడా నవ్వుతూ చెప్పింది.

పాప లేచిన అలికిడి వినబడటంతో శ్రీదేవి వెళ్ళి బెడ్‌రూంలో పడుకున్న పాపని ఎత్తుకుని బయటకి వచ్చింది.

"డెలివరీకి వెళ్ళాను ఆంటీ. నాలుగునెలలక్రితం మావారు ఈ ఫ్లాట్‌ని కొని తను వచ్చేసారు. నేను ఈ రోజు ఉదయమే వచ్చాను" చెప్పింది.

"నాకు ఆడపిల్లలంటే ఎంత ఇష్టమో!" ఆవిడ పాపని ఎత్తుకుని అడిగింది.

"పేరేం పెట్టారు?"

"ప్రతిమ."

"ప్రతిమ. మంచిపేరు. పేరుకి తగ్గట్లే బొమ్మలా ఉంది" ఆవిడ మెచ్చుకుంది.

"మా అత్తగారి పేరు ప్రభావతి. మామగారు తిరుమలరావుగారు. దాంతో మావారు ఇద్దరిపేర్లు రావాలని ప్రతిమ అని పెట్టారు. నేనింకా మంచిపేరు పెడదామనుకున్నాను" శ్రీదేవి అసంతృప్తిగా చెప్పింది.

"స్వర్ణ ప్రతిమ. ముద్దుగా ఉంది. రోజూ కొద్దిసేపు వచ్చి ఆడుకుంటాను. లేదా మా ఇంటికి తీసుకెళ్ళి ఆడించుకుంటాను" ఆవిడ పాపని ముద్దు పెట్టుకుంటూ చెప్పింది.

త్వరలోనే సద్గుణ, శ్రీదేవి మధ్య స్నేహం అభివృద్ధి చెందింది. పొద్దున్నే శ్రీదేవి పనుల్లో బిజీగా ఉన్నప్పుడు ఆవిడ ప్రతిమని తీసుకువెళ్ళి ఆడించి భాస్కర్ ఆఫీస్‌కి వెళ్ళాక తీసుకు వచ్చేది. బయటి పనులకి ఇద్దరూ కలిసి వెళ్ళేవారు.

ఆవిడ ఓ రోజు ఓ గౌను తెచ్చి ప్రతిమకి తొడుగుతూ చెప్పింది. "మేమిద్దరం సెంట్రల్ గవర్నమెంట్‌లో పనిచేసాం. ఒకడే అబ్బాయ్. వాడిని పెంచడానికి ఇద్దరం చాలా కష్టపడ్డాం. దాంతో రెండో సంతానం గురించి ఆలోచించలేదు. ఇప్పుడు అనిపిస్తూంటుంది. ఒక అమ్మాయికూడా ఉంటే బావుండేదని.

"మీ అబ్బాయి ఎక్కడుంటాడు ఆంటీ?" శ్రీదేవి అడిగింది.

"పూనేలో ఉంటాడు. పెళ్ళయి మూడేళ్ళయింది. క్లాస్‌మేట్‌నే పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరూ అక్కడే పనిచేస్తారు. మన దేశంలో ఉన్నారన్న పేరేగానీ ఏడాదికోసారి కూడా ఇటువైపు రారు. మావాడు మాత్రం రోజూ మాట్లాడతాడు. ఒక్కదాన్ని ఉన్నా ఏవో వ్యాపకాలు పెట్టుకుంటా కాబట్టి బోర్ అనిపించదు. నువ్వొచ్చాక అసలు టైం సరిపోవడంలేదు" ఆవిడ నవ్వుతూ చెప్పింది.

ఓ రోజు సద్గుణ స్వీట్ బాక్స్‌తో వచ్చి సంతోషంగా చెప్పింది. "శ్రీదేవీ! మా కోడలు నెలతప్పిందిట. మా అబ్బాయి ఫోన్ చేసాడు. ఈ వారంలో ఒకసారి పూనే వెళ్ళివస్తాను. వాడికో అమ్మాయి పుడితే ఎంచక్కా మన ప్రతిమలాగా రకరకాల డ్రెస్‌లు వేయచ్చు. రకరకాలుగా అలంకరించవచ్చు..." ఆవిడ పుట్టబోయే మనవరాలి గురించి చాలాసేపు మాట్లాడింది.

నాలుగురోజుల తర్వాత ఆవిడ పూనే వెళ్ళింది. శ్రీదేవికి ఏమీ తోచలేదు. 'ఆంటీ ఎప్పుడు వస్తారో' అని చాలాసార్లు అనుకుంది.

పదిరోజుల తర్వాత సద్గుణ ఇంటి తలుపు తీసి ఉండటం గమనించిన శ్రీదేవి వెంటనే ప్రతిమని ఎత్తుకుని తలుపుకొట్టి లోపలికి వెళ్ళింది. టి.వి మీది దుమ్ము తుడుస్తున్న సద్గుణ వాళ్ళని చూసి నవ్వి, చేతులు కడుక్కొచ్చి ప్రతిమని ఎత్తుకుని అడిగింది.

"ఎలా వున్నావు శ్రీదేవి?"

"మీరు లేకపోతే అసలు తోచలేదు ఆంటీ. ఎప్పుడెప్పుడు వస్తారా అని ఎదురు చూసాను. ఫోన్ చేద్దాం అనుకున్నాను కానీ బావుండదని చేయలేదు." శ్రీదేవిగారంగా చెప్పింది.

ఆవిడ పూనే నించి ప్రతిమకోసం తెచ్చిన బొమ్మలు, గౌన్లు ఇచ్చింది. శ్రీదేవి కోసం ఓ అందమైన చీరకూడా తెచ్చింది.

"ఇవన్నీ ఎందుకు ఆంటీ!?" శ్రీదేవి సిగ్గుపడింది.

"నాకు కూతురులాంటిదానివి. మొహమాటపడకు"

"మీ అబ్బాయి, కోడలు బావున్నారా ఆంటీ?" అడిగింది.

"బాగున్నారు" ఆవిడ అంతకుమించి చెప్పలేదు.

శ్రీదేవి ఆవిడని తమ ఇంటికి లంచ్‌కి ఆహ్వానించింది.

భోజనాలయ్యాక శ్రీదేవి నవ్వుతూ అడిగింది.

"మీ నాయనమ్మ కల గురించి చెప్పారా ఆంటీ మనవరాలు పుట్టాలని.?"

"లేదు శ్రీదేవీ. మా అబ్బాయికి అబ్బాయే పుట్టాలి. అమ్మాయి వద్దు." ఆవిడ గంభీరంగా చెప్పింది.

శ్రీదేవి తెల్లబోయింది.

"అదేంటాంటీ? మీ అబ్బాయికి మగపిల్లలు ఇష్టమా?" తేరుకుని అడిగింది

"వాడికి ఎవరైనా ఒకటే, కానీ నాకే మా అబ్బాయికి కొడుకు పుట్టాలని వుంది."

"ఎందుకలా? సడెన్‌గా?"

ఆవిడ చిరునవ్వు నవ్వింది. శ్రీదేవికి నవ్వురాలేదు.

"పూనే వెళ్ళివచ్చేసరికి నా అభిప్రాయాలు మారిపోయాయి శ్రీదేవి. ఇప్పుడు నేను దేవుడ్ని ప్రార్థించేది, మావాడికి కొడుకు పుట్టాలని" సద్గుణ చెప్పింది.

శ్రీదేవి మనస్సు చివుక్కుమంది. ఆవిడ ఆడపిల్లల్ని తక్కువ చేస్తోందని కూడా అనిపించింది. ఎదురింటివాళ్ళ ఆడపిల్లని ముద్దులాడచ్చుకానీ తన కొడుక్కి మాత్రం మగపిల్లవాడు పుట్టాలి.

ఆ తర్వాత చాలారోజులపాటు శ్రీదేవి ఆవిడతో సరిగ్గా మెలగలేకపోయింది.

ఓ రోజు రాత్రి పదిగంటలకి సద్గుణ ఫోన్ చేసింది.

"శ్రీదేవీ నా కోరిక ఫలించింది. మావాడికి కొడుకు పుట్టాడు. ఇప్పుడే వాడు నాకు ఫోన్ చేసాడు. వాడు పెట్టేయగానే నీకు చేస్తున్నాను" ఆవిడ గొంతునిండా సంతోషం.

"కంగ్రాట్స్ ఆంటీ. దేవుడు మీరేం చెప్పినా వింటాడు" శ్రీదేవి అభినందించింది.

సద్గుణ మళ్ళీ పూనే వెళ్ళి పదిరోజులు ఉండి వచ్చింది.

ఆరు నెలల తరువాత ఓ రోజు సద్గుణ చెప్పింది.

"రేపు మా అబ్బాయి, కోడలు, మనవడు వస్తున్నారు శ్రీదేవి. ఇక్కడో నాలుగురోజులు, కోడలి పుట్టింట్లో ఓ నాలుగురోజులు ఉండి వెళ్తారుట."

"అవునా? మీకేమైనా సహాయం కావాలంటే అడగండి ఆంటీ. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నేనే చేసిస్తాను. వంటలో సాయం చేస్తాను" శ్రీదేవి ఉత్సాహపడింది.

"థాంక్స్ శ్రీదేవీ అలాగే" ఆవిడ అంగీకరించింది.

ఆ రాత్రి శ్రీదేవి భర్తతో చెప్పింది.

"రేపు శనివారమేగా. పాపని మీరే చూసుకోవాలి. నేను ఆంటీకి హెల్ప్ చేస్తానని చెప్పాను."

"అలాగే" భాస్కర్ అంగీకరించాడు.

పొద్దుటినించీ ఎదురింట్లో సందడి, పిల్లవాడి ఏడుపు విన్న శ్రీదేవి గబగబా పూరీలు, బంగాళాదుంపల కూర చేసి రెండూ రెండు హాట్‌పేక్స్‌లో సర్ది, మరో పెద్ద బాక్స్‌లో ఇడ్లీలు, వేరుశనగపప్పు పచ్చడి సర్ది, వాటిని బేలన్సింగ్‌గా పట్టుకుని దగ్గరకి వేసి ఉన్న ఎదురింటి తలుపుని తీసి లోపలికి వెళ్ళింది. రెండు కాళ్ళూ పైన పెట్టి సోఫాలో కూర్చున్న ఓ అందమైన అమ్మాయి ఫోన్ చూస్తూ తలతిప్పి కూడా చూడలేదు. కాఫీ తాగుతున్న సద్గుణ కప్‌ని టీపాయ్ మీద పెట్టి, లేచివచ్చి ఓ రెండు బౌల్స్‌ని తీసుకుని అభిమానంగా విసుక్కుంది.

"ఏంటిది? ఎంతదూరమని? రెండుసార్లు తేవచ్చుగా?"

"ప్రతిమ చూస్తే వెంటబడుతుంది ఆంటీ" శ్రీదేవి సంజాయిషీగా చెప్పి ఆ యువతివైపు ఆసక్తిగా చూసింది.

"ఈ అమ్మాయి మా కోడలు కీర్తి. కీర్తీ శ్రీదేవి. మన ఫ్లాట్ ఎదుటి ఫ్లాట్ వీళ్ళదే" ఆవిడ పరిచయాలు చేసింది.

కీర్తి ఓసారి తలపైకెత్తి 'హాయ్' అని నిరాసక్తంగా చెప్పి, మళ్ళీ ఫోన్‌లో మునిగిపోయింది. శ్రీదేవి పెట్టిన నమస్కారాన్ని పట్టించుకోలేదు.

శ్రీదేవి కొద్దిగా చిన్నబుచ్చుకుని వంటింట్లోకి నడిచింది. బెడ్‌రూంలోంచి చేతుల్లో బాబుతో బయటకి వచ్చిన యువకుడు ఆమెని చూసి చెప్పాడు.

"హాయ్ సిస్టర్! మీరు మా అమ్మకి చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటున్నారట. థాంక్స్ ఏ లాట్"

"అదేంలేదు. ఆంటీయే నాకు కొండంత అండ" శ్రీదేవి సిగ్గుగా చెప్పింది.

అతని చేతుల్లోని బాబుని చూసి శ్రీదేవి చేతులు చాచింది.

"వంశీ!" కీర్తి ఓ గావుకేక పెట్టింది.

అంతా ఆమె వైపు చూసారు.

"బన్నీకి నీళ్ళు పోసావా? మమ్మీ వచ్చే టైమైంది. క్విక్" అరిచింది.

వంశీ బాబుని తల్లి చేతికిచ్చి హాల్లోని బాత్‌రూంలో పంపులు తిప్పి, వేణ్ణీళ్ళు, చన్నీళ్ళు సమపాళ్ళలో కలిపి, చెయ్యి పెట్టి చూసి, తృప్తిగా తలాడించి, గదిలోకి వెళ్ళి ఓ చిన్న స్టూల్, క్రీములు, సోప్‌లతో బయటికి వచ్చాడు.

ఈలోగా సద్గుణ పిల్లవాడి బట్టలు, నేపీ విప్పేసింది. వంశీ బాత్‌రూం గడపమీద కూర్చుని కాళ్ళు చాపి స్టూల్ మీద పెట్టుకుని తల్లి చేతుల్లోని కొడుకుని అందుకున్నాడు. వాడికి ముచ్చట్లు చెప్తూ ఒళ్ళంతా క్రీమ్ రాసాడు. తర్వాత సున్నిపిండితో నలుగుపెట్టాడు. దాన్ని

కడిగేసి లిక్విడ్ సోప్‌తో శుభ్రంగా వాడి ప్రతీ అవయవం రుద్ది రుద్ది, తోమి తోమి నీళ్ళు పోసాడు. వంటగదిలో సద్గుణకి సహాయం చేస్తున్న శ్రీదేవి మధ్య మధ్యలో తలతిప్పి వింతగా చూసింది.

సద్గుణ వెళ్ళి పిల్లవాడ్ని అందుకుని టవల్‌లో చుట్టింది వంశీ లేచి, స్టూల్ని ఓ మూలకి ఎత్తి బుద్ధిగా క్రీములన్నీ యథాప్రకారం సర్దాడు. తర్వాత పిల్లవాడ్ని తీసుకుని ఒళ్ళో పడుకోపెట్టుకుని మాయిశ్చరైజర్ ఒళ్ళంతా పూసాడు. తర్వాత వాడికి డైపర్ వేసి పైన డ్రెస్ వేసాడు. ఇంతలో కీర్తి 'మమ్మీ' అని కీచుగా అరుస్తూ లేచి, తలుపు తీసి లిఫ్ట్ దగ్గరకి పరిగెత్తింది. రెండు నిమిషాల్లో ఏభైల్లో ఉన్నావిడతో లోపలికి వచ్చింది. ఆవిడ రావడంతోనే మనవడి బుగ్గలు గట్టిగా పిండి ముద్దులాడింది. వాడు కెవ్వున ఏడుపు లంకించుకున్నాడు.

"నో బేబీ. గ్రామా కదా ఏడవకూడదు" కీర్తి కొడుకుకి ముద్దుగా చెప్పింది.

"బ్రేక్‌ఫాస్ట్‌కి రండి వదినా" సద్గుణ మర్యాదగా చెప్పింది.

"నేను తినేసే వచ్చాను" ఆవిడ ఎలాంటి సంబోధన లేకుండా చెప్పింది.

"కీర్తి?"

"నాకు ఆకలి లేదత్తయ్యా" ఆమె తల్లితో, కొడుకుతో బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది.

"నేను తింటాను. పెట్టమ్మా. చాలా ఆకలిగా ఉంది" వంశీ చెప్పాడు.

"మీ ఇద్దరూ తినండి ఆంటీ. నేను వడ్డిస్తాను" శ్రీదేవి చొరవగా డైనింగ్ టేబుల్ మీద ప్లేట్స్ పెట్టింది.

"పూరీ కూర వెరీ టేస్టీ సిస్టర్" వంశీ ప్రశంసగా చెప్పాడు.

"థాంక్స్"

"పూరీ చాలుగా. మళ్ళీ ఇడ్లీ ఏంటి శ్రీదేవి?" సద్గుణ మందలించింది.

"నేను తింటాలే అమ్మా. ఇడ్లీ తిని ఎన్ని రోజులైందో" వంశీ రెండు ఇడ్లీలు వడ్డించుకుంటూ చెప్పాడు.

"లెట్స్ మూవ్ వంశీ" కీర్తి గదిలోంచి బయటకి వస్తూ చెప్పింది.

"ఎక్కడికి?" సద్గుణ తెల్లబోయింది.

"అమ్మవాళ్ళింటికి అత్తయ్యా."

"రెండురోజులుండి వెళ్ళచ్చుగా?"

"లేదు. మా ఫ్రెండ్స్, రిలేటివ్స్ వస్తారు. ఇక్కడ నాకు తోచదు" కీర్తి సూట్‌కేస్‌తో బయటకి వెళ్ళి నిలబడింది.

వంశీ ప్లేట్ తీసి సింక్‌లో పెట్టి డ్రెస్ మార్చుకుని వచ్చి తల్లితో చెప్పాడు.

"వెళ్ళొస్తా అమ్మా. మధ్యమధ్యలో వస్తాలే."

"అయ్యో ఆంటీ ఇంత ప్రిపేర్ చేసాం ఎలా?" శ్రీదేవి సగం అయిన వంటని చూసి దిగులుగా చెప్పింది.

"పర్లేదులే శ్రీదేవి. భాస్కర్‌ని ఇక్కడికే రమ్మను. మనం తిందాం" సద్గుణ నిబ్బరంగా చెప్పింది.

సోమవారం మధ్యాహ్నం సద్గుణ తలుపు తీసుకుని లోపలికి వచ్చింది. టి.వి చూస్తున్న శ్రీదేవి దాన్ని ఆపి ఆప్యాయంగా చెప్పింది.

"రండి ఆంటీ. నిన్న మావారి ఫ్రెండ్స్ ఇంటికి వెళ్ళాం"

"అనుకున్నాను. ఉంటే కనిపించకుండా ఉండవుగా" ఆవిడ నవ్వింది.

"కూర్చోండి ఆంటీ. మీ మనవడు ఎంత ముద్దుగా ఉన్నాడో! మీ అబ్బాయి పోలిక." శ్రీదేవి చెప్పింది.

"అవును వంశీ చిన్నప్పుడు వీడిలాగే ఉండేవాడు. ప్రతిమ నిద్రపోతోందా?"

"అవునాంటీ. ఒక్క నిమిషం. కాఫీ తెస్తాను" శ్రీదేవి లేచింది.

"వద్దొద్దు. కూర్చో నీతో మాట్లాడాలి" ఆవిడ రెండు క్షణాలాగి అడిగింది.

"ఆడపిల్లలు ఇష్టం అని చెప్పి తర్వాత సడన్‌గా అబ్బాయే పుట్టాలని అన్నానని నీకు కోపం వచ్చింది కదూ?"

శ్రీదేవి ఇబ్బందిగా చూసి చెప్పింది.

"అవును. మీమీద నాకెంత గౌరవమో. అలాంటిది మీరు అలా పక్షపాతంగా మాట్లాడితే బాధా, కోపం రెండూ వచ్చాయి."

"ఆడపిల్లలంటే నాకు చాలా ఇష్టం శ్రీదేవి. ముఖ్యంగా ప్రతిమని చూసాక వంశీకి కూడా ఇలాంటి పాపపుడితే బావుండు అనుకునేదాన్ని. కీర్తి నెలతప్పిందని విన్నాక పూనే వెళ్ళి ఓ పదిరోజులు ఉండి వచ్చాను గుర్తుందా? అప్పుడు మా అబ్బాయి సంసారం చూసాను. నేను కోడల్ని వెదికి తెచ్చి పెళ్ళి చేస్తే ఎలా ఉండేదో తెలియదు కానీ వాడు ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. కీర్తి అన్ని విషయాల్లో వాడ్ని డామినేట్ చేస్తుంది. చాదస్తం అనుకోకు. ఎదుటివాళ్ళమీద అధికారం చలాయించడం వేరు. ఉక్కిరి బిక్కిరి చేయడం వేరు. మొన్నవాడు ఇడ్లీ తింటున్నాడని తెలుసు. అధికారం చలాయించేవాళ్ళు 'త్వరగా తిను. మా పుట్టింటికి పోవాల'ని డామినేటింగ్‌గా మాట్లాడతారు. కీర్తి ఏం చేసింది? సూట్‌కేస్, కొడుకులతో బయటకి వెళ్ళి నుంచుంది. అప్పుడు వాడేం చేసాడు? ఉక్కిరిబిక్కిరై చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు. కీర్తి అనే సుడిగుండంలో వంశీ చిక్కుకుపోయాడు. ఐనా పదిరోజులుండిపోయేదానికి నాకెందుకు అని నేను ఇన్‌వాల్వ్ అవలేదు.

భార్యాభర్తలిద్దరూ కలిసి పనిచేసుకోవడం తప్పు అని నేను అనను. కానీ కొన్ని పనులు మాత్రం ఆడపనులు, మగపనులు అని ఉంటాయి. ఆ కొన్ని పనులు మాత్రం వాళ్ళే చేయాలి. శ్రమ విభజనలో కూడా విచక్షణ ఉండాలి. భర్తని సహాయకుడుగా చూడాలి కానీ పనివాడుగా కాదు. ఓ రోజు కీర్తి తన ఫ్రెండ్ ఇంటికి తీసుకెళ్ళింది. ఆ అమ్మాయి అచ్చం కీర్తిలాంటిదే వాళ్ళాయనకి ఊపిరాడనివ్వడం లేదు. వాళ్ళకి ఓ పాప. మొన్న వంశీ కొడుక్కి ఎలా స్నానం చేయించాడో అలా అతను కూతురికి నీళ్ళు పోసాడు. ఆ పిల్లని కాళ్ళమీద వేసుకుని రుద్దిరుద్ది శుభ్రం చేసాడు. నాకెందుకో అసహ్యంగా అనిపించింది. నేను ఎం.ఎస్సీ చదివాను. గజెటెడ్ జాబ్ చేసాను. ఐనా కూడా కొన్ని నాకు తప్పుగా అనిపిస్తాయి. అది ఆర్నెల్ల చిన్నపాపే కావచ్చు కానీ తండ్రి దాని కాళ్ళు దూరంగా పెట్టి, తోమి తోమి స్నానం చేయించడం నాకు నచ్చలేదు. భవిష్యత్తులో వంశీ కూడా అంతేనని నాకు తెలుసు. వాడు తనకూతురికి ఈ విధంగా ఐదారేళ్ళపాటు స్నానం చేయిస్తాడంటేనే నాకు సిగ్గుగా అనిపించింది. దాంతో వాడికి కూతురు పుట్టొద్దు. కొడుకే పుట్టాలి అని ప్రార్థించాను.

"రెండో కారణం కీర్తి. నువ్వు కీర్తి వాళ్ళమ్మని చూసావు. నా ఇంటికి వచ్చి నన్ను కానీ, తన అల్లుడ్ని కానీ పలకరించలేదు. వాడు తినేదాకా ఆగుదాం. తొందరేముంది?' అనలేదు. ఆవిడ పెంపకంలో కీర్తి ఎలా తయారైందో, కీర్తి పెంపకంలో ఆ పుట్టబోయే బేబీకూడా అలాగే తయారవుతుంది. అది నాలాంటి మరో తల్లికి కడుపుకోత అవుతుంది. అందుకనే మావాడికి కొడుకు పుట్టాలని చెప్పింది."

శ్రీదేవి ఆమె పక్కన నిలబడి ఓదార్పుగా ఆవిడ చేతిని పట్టుకుంది.

"కీర్తిది నీ వయసే. కానీ నీలోని మంచి లక్షణం ఒక్కటికూడా లేదు. ఈ కాలంలో నీలాంటివాళ్ళు అరుదు శ్రీదేవి. భాస్కర్ అదృష్టవంతుడు. మొన్న కీర్తి ఫోన్‌లో ఎవరితోనో చెప్తోంది. 'ఒక్కడుచాలు ఇంక కనడం, పెంచడం నా వల్లకాదు' అని. ఎందుకో చాలా ఆనందంగా అనిపించింది."

సద్గుణ పమిట కొంగుతో కళ్ళొత్తుకుంది. శ్రీదేవికి ఏం మాట్లాడాలో అర్థంకాక చూస్తూండిపోయింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments